ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



పాఠకులు, ప్రకటనకర్తలు, శ్రేయోభిలాషులకు
వినాయక చవితి శుభాకాంక్షలు
పండుగ సందర్భంగా నేడు సెలవు మంగళవారం సంచిక వెలువడదు.. పునఃదర్శనం బుధవారం
- ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి
(ప్రభాత ఉదయం)

సంపుటి: 4 | సంచిక: 156 | పేజీలు: 6 | వెల: రూ.3/- | సోమవారం 14 సెప్టెంబర్ 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

## రోశయ్య దూరదృష్టి వల్లే తెలంగాణకు
# మిగులు బడ్జెట్ వచ్చింది



**సీఎం రేవంత్ రెడ్డి**

**ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన్‌కు భూమిపూజ**

**ఆర్యవైశ్యుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ**

**హైదరాబాద్‌లో రోశయ్య విగ్రహం ఏర్పాటు చేస్తా**

**ఆర్యవైశ్య ఆత్మగౌరవ సభలో రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం)**

ఆర్యవైశ్యులు సౌమ్యులు, ఆత్మాభిమానం కలిగిన వారన్న సీఎం రేవంత్ రెడ్డి పేదరికం ఉన్నా ఆర్యవైశ్యులు కడుపులో దాచుకుంటారని స్పష్టం చేసారు. ఆయన ఇవాళ హైదరాబాద్ ఉప్పల్ భగాయత్‌లో ఆర్యవైశ్య ఆత్మగౌరవ భవన్‌కు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్నముఖ్యమంత్రి ఆర్యవైశ్య భవన నిర్మాణానికి సహకరిస్తానని, వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

భవిష్యత్ ఉంటుందని రోశయ్య ఆనాడే సలహా ఇచ్చారు : ఆర్యవైశ్యులు ఆకలితో ఉన్నవారి ఆకలి తీరుస్తున్నారని రేవంత్ రెడ్డి ప్రశంసించారు. ఆర్యవైశ్య సోదరులు పేదలకు ఉదారంగా అప్పు ఇస్తారని, తాను సుదీర్ఘ కాలం రాజకీయాల్లో రాణిస్తానని మాజీ సీఎం రోశయ్య గుర్తించారని పేర్కొన్నారు. అసెంబ్లీలో దూకుడుగా మాట్లాడుతుంటే ఆవేశం తగ్గించుకోవాలని చెప్పారని, ఆవేశానికి ఆలోచన తోడయితే భవిష్యత్ ఉంటుందని రోశయ్య సలహా ఇచ్చారని గుర్తు చేసుకున్నరు. రోశయ్య ఎవరినైనా విమర్శిస్తారు కానీ దూషించరని కొనియాడారు. రోశయ్య విగ్రహం హైదరాబాద్‌లో ఉండాలని నిర్ణయించామని, హైదరాబాద్‌తోనే తన అనుబంధం ముడిపడి ఉందని రోశయ్య చెప్పేవారని సీఎం వెల్లడించారు.

ఆర్యవైశ్యులు కలిసికట్టుగా ఉంటేనే బలం : ఆర్యవైశ్యులు ఆర్థిక క్రమశిక్షణ కలిగిన వారన్న రేవంత్ రెడ్డి కాంగ్రెస్ హయాంలో గల్లాపెట్టె వ్యవహారం ఆర్యవైశ్యులకే ఇచ్చామని అన్నారు. ఆర్థికలావాదేవీల్లో సలహాల కోసం ఆర్యవైశ్యులనే అడుగుతారని, సీఎంలు ఎంతమంది మారినా ఆర్థికమంత్రిగా రోశయ్యనే ఉన్నారని, రోశయ్య దూరదృష్టి వల్లే తెలంగాణకు మిగులు బడ్జెట్ వచ్చిందని కొనియాడారు. ఆర్యవైశ్యులు కలిసికట్టుగా ఉంటేనే బలమని సూచించారు. ఆర్యవైశ్యుల బిడ్డ గాంధీ అంటే ప్రపంచంలో తెలియనివారు లేరని, ఆంధ్ర రాష్ట్ర కోసం ప్రాణత్యాగం పొట్టి శ్రీరాములు ఆర్యవైశ్యుడేనని గుర్తు చేశారు.



### మంత్రి పదవి పోయిందని
# ఇంట్లో కూర్చోను
## కొండా సురేఖ

**భవిష్యత్తులోనూ కాంగ్రెస్ టికెట్‌పైనే పోటీ చేస్తామని స్పష్టం చేసిన కొండా దంపతులు**

**మంత్రి పదవి పోయినందుకు బాధ లేదు, కానీ కారణం చెప్పకపోవడమే ఆవేదన కలిగించింది**

**స్థానిక నేతలపై పరోక్షంగా విమర్శలు గుప్పించిన మాజీ మంత్రి**

**హైదరాబాద్, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం)**

తాను కాంగ్రెస్ పార్టీని వీడుతున్నట్టుగా కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారానికి మాజీ మంత్రి, కాంగ్రెస్ ఎమ్మెల్యే కొండా సురేఖ ఫుల్ స్టాప్ పెట్టారు. ఆ వార్తలన్నీ నిరాధారమైనవని, కేవలం కల్పిత కథనాలని ఆమె కొట్టిపారేశారు. తన భర్త కొండా మురళితో కలిసి ఆదివారం వరంగల్‌లో పార్టీ కార్యకర్తలు, మద్దతుదారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్‌ను వీడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

"మేము కాంగ్రెస్‌లోనే పుట్టాం, కాంగ్రెస్‌లోనే పెరిగాం. మాకు వేరే పార్టీలోకి వెళ్లాలనే ఆలోచన లేదు" అని కొండా సురేఖ తేల్చిచెప్పారు. గతంలో కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లో బీఆర్‌ఎస్‌లోకి వెళ్లాల్సి వచ్చిందని అన్నారు. తమను ఎవరూ బయటకు పంపలేదని ..మిగతా 2లో



### నడిసంద్రంలో
# మునిగిన నౌక

**242 మంది గల్లంతు**

**100 మందిని రక్షించినట్లు ప్రకటించిన ప్రభుత్వం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం)**

లోని జావా సముద్రంలో ప్రయాణికులతో వెళ్తున్న ఒక నౌక అకస్మాత్తుగా గల్లంతయింది. తూర్పు జావాలోని సురబయ నుంచి దక్షిణ కలిమంతన్ ప్రాంతంలోని బంజర్మసిన్‌కు ప్రయాణికులతో బయలుదేరిన విర్గో ట్రాన్స్‌పోర్ట్ 8 నౌక ప్రయాణంలో ఉండగా ఒక్కసారిగా సిగ్నల్స్ కోల్పోయి, కమ్యూనికేషన్ కట్ అయి పోయింది. ఈ నౌకలో సుమారు 240 మంది ..మిగతా 2లో

# 'బ్రిక్స్ పగ్గాలు చైనాకు- ఇకపై ఫలితాలు చూపించాల్సిందే'




**బ్రిక్స్ ముగింపు సమావేశంలో ప్రధాని మోదీ**

**ఢిల్లీ డిక్లరేషన్‌ను కాలపరిమితితో అమలు చేయాలని బ్రిక్స్ దేశాలకు మోదీ సూచన**

**బ్రిక్స్ ఇక కేవలం దేశాల కూటమి కాదని, పరిష్కారాల వ్యవస్థ అన్న ప్రధాని**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం)**

బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు రెండో రోజు ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. బ్రిక్స్ దేశాలు తీసుకున్న నిర్ణయాలు కేవలం పత్రాలకే పరిమితం కాకుండా, క్షేత్రస్థాయిలో కనిపించే ఫలితాలుగా మారాలని స్పష్టం చేశారు. దిల్లీలో ఆమోదించిన డిక్లరేషన్, బ్రిక్స్ దేశాల ఉమ్మడి లక్ష్యాలకు స్పష్టమైన దిశ చూపుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

దిల్లీలోని భారత్ మండపంలో జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు ముగింపు సమావేశంలో ఆదివారం మధ్యాహ్నం మోదీ మరోసారి మాట్లాడారు. రెండు రోజుల పాటు జరిగిన చర్చలు బ్రిక్స్‌పై తమ నమ్మకాన్ని మరింత పెంచాయని అన్నారు. బ్రిక్స్ కేవలం కొన్ని దేశాలు కలిసి పనిచేసే వేదిక మాత్రమే కాదని, ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు వెతికే వ్యవస్థగా ..మిగతా 2లో

## ఏడు కొండల ఎంకన్నకు
# ఏరువాడ జోడు పంచెలు

### తిరుమల తిరుపతికి ఎరువాడ పంచలు సమర్పించిన గద్వాల సంస్థానాధీశులు

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం)**

ప్రతియేటా అశ్వయుజ మాసంలో ప్రారంభమయ్యే తిరుమల తిరుపతి వేంకటేశ్వరుని నవరాత్రి బ్రహ్మోత్సవాలకు గద్వాల చేనేత పరిశ్రమకు అవినాభావ సంబంధం ఉంది. ఎందువలనంటే నవరాత్రి బ్రహ్మోత్సవాల ప్రారంభం రోజున తిరుమల వేంకటేశ్వరునికి ఇక్కడ నేత మగ్గంపై తయారు చేసే ఏరువాడ జోడు పంచెలను అలంకరించిన తర్వాతనే బ్రహ్మోత్సవాలు ప్రారంభం కావడం గద్వాల చేనేత పరిశ్రమ చేసుకున్న పుణ్యఫలంగా కార్మికులు భావిస్తారు. ఈ యేడాది జరిగే శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా గద్వాల సంస్థానాధీశులు కృష్ణ రాంభూపాల్ ఆధ్వర్యంలో చేనేత ప్రతినిధులు గద్వాల ఏరువాడ జోడు పంచలను సంప్రదాయబద్ధంగా తిరుమల తిరుపతి ఈఓకు సమర్పించారు. గద్వాల చేనేత కళాకారులు ప్రత్యేకంగా తయారు చేసిన జోడు పంచల సమర్పణతో గద్వాల--తిరుమల ఆధ్యాత్మిక, సాంస్కృతిక అనుబంధం మరోసారి చాటిచెప్పారు. గద్వాల సంస్థానాధీశులు కృష్ణరాం భూపాల్, గద్వాల చేనేత కళాకారుల బృందం తిరుమలకు చేరుకుని గద్వాలలో ప్రత్యేకంగా తయారు చేసిన జోడు పంచలను శ్రీవారి ఆలయంలో సమర్పించారు గద్వాల సంస్థానం--తిరుమల మధ్య కొనసాగుతున్న



ఆధ్యాత్మిక, సాంస్కృతిక అనుబంధానికి ఈ వస్త్ర సమర్పణ ప్రతీకగా నిలిచింది. గత 400 సంవత్సరాలుగా గద్వాల సంస్థానం వ్యవస్థాపకుల కాలం నుంచే శ్రీవారికి పవిత్ర వస్త్రాలను సమర్పించే సంప్రదాయం కొనసాగుతోందని ప్రతినిధులు తెలిపారు. ప్రతి ఏడాది బ్రహ్మోత్సవాల సమయంలో గద్వాల చేనేత కళాకారులు ప్రత్యేక శ్రద్ధతో ఏరువాడ పంచలను తయారు చేసి స్వామి వారికి సమర్పించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. గద్వాల ప్రాంతం చేనేత కళకు ఎంతో ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఇక్కడి కళాకారులు తమ సంప్రదాయ నైపుణ్యంతో ప్రత్యేకమైన వస్త్రాలను తయారు చేస్తుంటారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పంచలను సమర్పించడం ద్వారా ఈ చేనేత కళకు మరింత ప్రాచుర్యం లభిస్తోందని ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సంప్రదాయం వల్ల చేనేత కళాకారుల నైపుణ్యానికి గౌరవం లభించడంతో పాటు వారి ఉపాధికి కూడా ప్రోత్సాహం లభిస్తుందని తెలిపారు.తరతరాలుగా వస్తున్న చేనేత వారసత్వాన్ని కాపాడటంలో ఇలాంటి కార్యక్రమాలు కీలకంగా మారుతున్నాయని చెప్పారు. గద్వాల చేనేత కళాకారులు తయారు చేసిన వస్త్రాలు శ్రీవారి సేవలో భాగం కావడం తమకు ఎంతో గర్వకారణమని ప్రతినిధులు పేర్కొన్నారు. గద్వాల ప్రాంత చారిత్రక, సాంస్కృతిక వైభవాన్ని మరింతగా వెలుగులోకి తీసుకురావడంలో శ్రీవారికి వస్త్ర సమర్పణ కార్యక్రమం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. గద్వాల సంస్థానం నుంచి కొనసాగుతున్న ఈ సంప్రదాయం కేవలం ఆధ్యాత్మిక కార్యక్రమమే కాకుండా స్థానిక చేనేత కళ, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తోందని తెలిపారు.



# హర్మూజ్ జలసంధిపై కొత్త మార్గాలు

**ఇరాన్, ఒమన్ కీలక ఒప్పందం!**

**హర్మూజ్‌లో కొత్త ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలపై ఇరాన్, ఒమన్ అవగాహన**

**సోమవారం గల్ఫ్ దేశాలకు వివరాలు వెల్లడించనున్న ఇరు దేశాలు**

**పశ్చిమాసియాలో ఉద్రిక్తతల వేళ కీలక పరిణామం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం)**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న వేళ, ప్రపంచ దేశాల చూపు మరోసారి హర్మూజ్ జలసంధిపై పడింది. ప్రపంచ చమురు, ఇంధన సరఫరాకు అత్యంత కీలకమైన ఆ మార్గంలో ఇరాన్, ఒమన్ కలిసి కీలక నిర్ణయం తీసుకున్నాయి. హర్మూజ్ జలసంధిలో కొత్త ఎంట్రీ, ఎగ్జిట్ మార్గాలను ..మిగతా 2లో

# రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలలో
# వినాయక చవితికి ఏర్పాట్లు పూర్తి



హైదర్‌గూడలో విఘ్నేశ్వరునికి స్వాగతం పలుకుతున్న స్థానిక నాయకులు



బాబుల్ రెడ్డి నగర్ లో పర్యావరణ గణపతులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు సోమ శ్రీనివాస్ గుప్తా



కాటేదాన్ లో పర్యావరణ గణపతులను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**బుద్వేల్, సెప్టెంబరు 18 (ప్రభాత ఉదయం) :**

రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్ల పరిధిలోని రాజేంద్రనగర్, హైదరూడ, అత్తాపూర్, మైలార్దేవుపల్లి, కాటేదాన్, సులేమాన్ నగర్, శాస్త్రీపురం డివిజన్ల పరిధిలోని బస్తీలలో వినాయక చవితి ఉత్సవాలను ఈ నెల 14న నిర్వహించడానికి భక్తులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. భారతీయుల ముఖ్య పండుగలలో ఇది ఒక పండుగ అని చెప్ప వచ్చు. పార్వతి పరమేశ్వరుల కుమారుడైన వినాయకుని పుట్టిన రోజు ను వినాయక చవితి గా జరుపుకుంటారు. భాద్రపదమాసం శుక్ల చతుర్థి హస్త నక్షత్రం రోజున చవితి ఉత్సవాలు ప్రారంభమౌతాయి. ఆ నాటి నుంచి 11 రోజుల పాటు పూజలు చేసి ఆ తర్వాత వినాయక ప్రతిమ లను చెరువు లలో నిమజ్జనం చేస్తారు.

**ఘన స్వాగతం పలికిన నాయకులు, భక్తులు, మండపాల నిర్వాహకులు :**

వినాయకులను బస్తీలలో, కాలనీ మండపాలలో ప్రతిష్టించడానికి తీసుకువచ్చిన సందర్భంగా వివిధ పార్టీల నాయకులు, భక్తులు, మండపాల నిర్వాహకులు వినాయక ప్రతిమ లకు ఘన స్వాగతం పలికారు. మైలార్దేవుపల్లి లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ ప్రకాశ్ గౌడ్, హైదర్ గూడ లో బీజేపీ నాయకులు ఎన్ మల్లారెడ్డి, రాజేంద్రనగర్ లో గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షులు వై.శ్రీధర్ లు వినాయక విగ్రహాలకు స్వాగతం పలికి పూజలు చేశారు. బుద్వేల్ శ్రీ శివసాయి కాలనీ లో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం గోపాల్ రెడ్డి, సి ఇంద్రసేన రెడ్డి, ఎన్ నరేష్ గౌడ్, షాబుద్దీన్, శంకర్ నాయక్, కె లక్ష్మణ్ కుమార్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహ ప్రతిష్ట ఏర్పాట్లు చేశారు.



కాటేదాన్ లో ప్రతిష్టించడానికి తీసుకువచ్చిన గణనాధుని కి స్వాగతం పలికి పూజలు చేసిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్, నాయకులు



బుద్వేల్ శ్రీ శివ సాయి కాలనీ లో ప్రతిష్టించడానికి తీసుకువచ్చిన బొజ్జ గణపయ్య

**పర్యావరణ గణపతుల పంపిణీ**

జీహెచ్ఎంసీ సహకారంతో బస్తీలలో పర్యావరణ గణపతులను పంపిణీ చేశారు. కాటేదాన్ లో మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పర్యావరణ గణపతులను పంపిణీ చేశారు. బాబుల్ రెడ్డి నగర్ లో కాం గ్రెస్ నాయకులు సోమ శ్రీనివాస్ గుప్తా పర్యావరణ గణపతులను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు పర్యావరణ గణపతులను మాత్రమే ప్రతిష్టి పూజలు చేయాలన్నారు. ఈ కార్యక్రమాలలో ఆయా పార్టీ ల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాందేవ్ బాబా జన్మదిన వేడుకలలో పాల్గొన్న
# ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్, బీఆర్ఎస్ నేత పి కార్తీక్ రెడ్డిలు



శివరాంపల్లి రాందేవ్ బాబా జన్మదిన వేడుకలలో పాల్గొన్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్



రాందేవ్ బాబా జన్మదిన వేడుకలలో పాల్గొన్న బి ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేష్ లు

**బుద్వేల్, సెప్టెంబరు 13 (ప్రభాత ఉదయం)**

శివరాంపల్లి లోని రాందేవ్ బాబా దేవాలయంలో ఆదివారం జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ పూజా కార్యక్రమాలలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టీ ప్రకాష్ గౌడ్, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పి కార్తీక్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ ఎస్ వెంకటేశ్ తో పాటు వివిధ పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామీ వారి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి ప్రకాశ్ గౌడ్ మాట్లాడుతూ, శివరాంపల్లిలోఓ గల రాందేవ్ బాబా దేవాలయానికి నగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు వచ్చి దర్శనం చేసుకుంటారని గుర్తు చేశారు. ఆధ్యాత్మిక చింతన మనిషిని సన్మార్గంలో నడిపిస్తుందన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలందరు సుఖ సంతోషాలతో ఉండాలని ఆ భగవంతుణ్ణి వేడుకున్నానన్నారు. బీఆర్ఎస్ నేత పి కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ, రాందేవ్ బాబా దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం సంతోషకరమన్నారు.

# భారతరత్న పొందిన శాస్త్రవేత్తకే తన పేరు నిరూపించుకోవాల్సిన పరిస్థితి

**'సర్' ప్రారంభం నుంచి వస్తున్న విమర్శలే.**

**'సర్' చర్యలు, నిర్ణయాలు ప్రతిపక్షాల్లోనే కాదు, ప్రజల్లోనూ అనుమానాలు**

**ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా, ఒక తొత్తులా వ్యవహరిస్తోందన్న విమర్శలు**

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 13 (ప్రభాత ఉదయం)**



దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పౌర పురస్కారం భారతరత్న. దేశానికి, సమాజానికి వివిధ రంగాల్లో అందించిన అసాధారణ సేవలకు ఇచ్చే అత్యున్నత గుర్తింపు. అలాంటి గౌరవాన్ని అందుకున్న ప్రముఖ శాస్త్రవేత్త ప్రొఫెసర్ సి.ఎన్.ఆర్.రావుకు 'సర్' నోటీసులు రావడం దిగ్భ్రాంతికరం. తొంభై రెండేళ్ల వయసులో భారత శాస్త్రరంగానికి ప్రపంచవ్యాప్త గుర్తింపు తెచ్చిన మహోన్నత శాస్త్రవేత్త పేరు ఓటర్ల జాబితాలోని పాత రికార్డుతో సరిపోలలేదనే కారణంతో సమస్యాత్మకంగా మారడం ఎన్నికల సంఘం పనితీరుపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది. దేశవ్యాప్తంగా చర్చకు దారితీయడంతో కర్ణాటక ఎన్నికల సంఘం తప్పును ఎలా సరిచేయాలో మల్లగుల్లాలు పడుతోంది. మొదట ఆయన పేరు తప్పుగా ఉందని చెప్పి, ఇప్పుడు నోటీసులే ఇవ్వలేదని బుకాయిస్తోంది. కానీ ఆయన పేరు 'డిస్క్రెపెన్సీ' జాబితాలోకి ఎలా వచ్చిందన్న ప్రశ్నకు మాత్రం సమాధానం లేదు. సి.ఎన్.ఆర్.రావు 'నేను భారత పౌరుడినే' అని నిరూపించుకోవాలా? 'నాకు భారతరత్న కూడా ఇచ్చారు, నన్ను గుర్తించండి' అంటూ వేడుకోవాలా? అసలు 'సర్' పేరుతో ఏం జరుగుతోంది దేశంలో? సి.ఎన్.ఆర్.రావు ఒక వ్యక్తి మాత్రమే కాదు. నిర్మాణాత్మక రసాయన శాస్త్రం, పదార్థాల శాస్త్రంలో ఆయన చేసిన పరిశోధనలు భారతదేశానికి అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చాయి.దేశంలో శాస్త్ర పరిశోధనా సంస్థల అభివృద్ధికి, కొత్త తరాల శాస్త్రవేత్తల తయారీకి ఆయన చేసిన సేవలు అపారం. అందుకే దేశం 2014లో ఆయనను భారతరత్నతో గౌరవించింది. అలాంటి వ్యక్తి పేరు ఒక చిన్నపాటి రికార్డు తేడాతో అనుమానాల జాబితాలోకి రావడం భారతరత్న గౌరవానికే అవమానం. ఇక్కడ ప్రముఖులు, చిన్నవారు, పెద్దవారు అందరూ సమానమే కదా అన్న ప్రశ్న వస్తుంది. కానీ, అస్సాంలో 'సర్' చేపట్టిన పుడు మయన్మార్ నుంచి వచ్చిన రోహింగ్యాలను ఏరివేయడానికేనని కేంద్రం చెప్పింది. తర్వాత బెంగాల్‌లో బంగ్లాదేశ్, బర్మా నుంచి వచ్చిన చొరబాటుదారుల కోసమనేని వాదించింది. ఇప్పుడు కర్ణాటకలో ఎవరున్నారు? తెలంగాణలోకి ఎవరు వచ్చారు? 'సర్' పేరుతో ప్రముఖులకు నోటీసులు పంపడం, వారు దేశానికి చేసిన సేవలను అవమానించడమే తప్ప వేరేకాదు. ఇది ఒక్క సి.ఎన్.ఆర్.రావు వ్యవహారంగా చూడలేం. పద్మశ్రీ గ్రహీత హరేకళ హజబ్బా, ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకణి కుటుంబం, జెరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ తదితర ప్రముఖుల పేర్లు కూడా 'సర్'లోని డిస్క్రెపెన్సీ లేదా మ్యాపింగ్ సమస్యల్లో చిక్కుకున్నాయి. హైదరాబాద్‌లో మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్, నటుడు మహేశ్ బాబు, తదితరులకు 'సర్' నోటీసులు వచ్చినట్లు తాజా సమాచారం. ప్రముఖుల పేర్లు బయటకు రావడంతో ఈ వ్యవహారం ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తోంది.ఇదంతా 'సర్' దుశ్చర్యలో ఓ భాగం మాత్రమే. అసలు సమస్య సామాన్య ఓటర్లది. కర్నాటకలోనే 43.81 లక్షల మంది ఓటర్లకు నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది. పేరు మారడం, పాత రికార్డుతో వివరాలు సరిపోకపోవడం వంటి కారణాలతో పౌరులు తమ గుర్తింపును పదేపదే నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. పత్రాలు అందజేసినా రశీదు ఇవ్వడం లేదని పలువురి ఆందోళనగా ఉంది. తెలంగాణలోనూ భారీ స్థాయిలో ఓటర్ల జాబితా సవరణ చేపట్టడం, ఇప్పటికే లక్షలాది పేర్లు తొలగింపు, మరికొందరికి నోటీసుల ప్రక్రియ ప్రజల్లో అను మానాలకు తావిస్తోంది. ఓటర్ల జాబితాలో తప్పులను సరిచేయడం అవసరమే. నకిలీ ఓట్లను తొలగించాల్సిందే. కానీ ఆ పేరుతో అసలైన ఓటర్లను తొలగించడం లేదా తమ ఓటు హక్కును కాపాడుకోవడానికి పౌరులే అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి తలెత్తడం మాత్రం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం. 'సర్' ప్రారంభానికి ముందే ఢిల్లీ ఎన్నికల సమయంలో పెద్ద సంఖ్యలో ఓట్లు తొలగించారన్నది ఇప్పుడిప్పుడే వెలుగు చూస్తున్నది.ఇప్పుడు వివిధ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితాలపై తలెత్తుతున్న వివాదాలు చూస్తే 'సర్'ను కేవలం సాంకేతిక ప్రక్రియగా కొట్టిపారేయలేం. ముస్లింలు, దళితులు, గిరిజనులు, వలస కార్మికులు, పేదలు, బీజేపీ వ్యతిరేకులను లక్ష్యంగా చేసుకుని ఓట్లను ఏరి మరీ తీసేస్తున్నట్టు తెలుస్తోంది. కారణంగా ఏదో ఒక తప్పును వెతికి, దానికి కావాల్సిన ఆధారాలు చూపించమనడం వారిని ఓటుకు దూరం చేసే ఎత్తుగడనే! ఎన్నికల సంఘం కూడా దీనికి వంతపాడే విధానాలే అవలంభిస్తోందన్నవి 'సర్' ప్రారంభం నుంచి వస్తున్న విమర్శలే. దాని చర్యలు, నిర్ణయాలు ప్రతిపక్షాల్లోనే కాదు, ప్రజల్లోనూ అనుమానాలు కలిగిస్తున్నాయి. ఎన్నికల సంఘం బీజేపీకి అనుకూలంగా, ఒక తొత్తులా వ్యవహరిస్తోందన్న విమర్శలకు తావివ్వకుండా తన స్వతంత్రతను నిరూపించుకోవడంలో అది విఫలమవుతోంది. అందుకే రాజ్యాంగబద్ధ సంస్థగా ఈసీపై ఉన్న విశ్వాసాన్ని కాపాడుకోవడం, ఓటర్లలో అభద్రతను తొలగించడం అత్యంత అవసరం. 'సర్' ప్రజాస్వామ్యాన్ని మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా మార్చే ప్రక్రియ కావాలి. కానీ అదే ప్రక్రియలో ఓటరే తన పౌరసత్వాన్ని, తన ఉనికిని, తన ఓటు హక్కును నిరూపించుకోవాల్సి వస్తే అది ప్రజాస్వామ్యానికి మేలు చేయదు. భారతరత్న పొందిన శాస్త్రవేత్తకే తన పేరు నిరూపించుకోవాల్సిన పరిస్థితి వస్తే, సామాన్య ఓటరు పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తప్పక తలెత్తుతుంది. ఓటరు జాబితాను శు ద్ధి' చేయడమే కాదు, ఓటు హక్కును కాపాడటమే ఎన్నికల సంఘం మొదటి బాధ్యత.

## రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు దుర్మరణం

**బుద్వేల్, సెప్టెంబరు 13 (ప్రభాత ఉదయం)**



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బాలుడు

అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిల్లర్ నెంబర్ 232 వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనం వెనుకాల కూర్చున ఓ బాలుడు మృతి చెందాడు. వివరాలు ఈ విదంగా ఉన్నాయి. గుడిమల్కాపూర్ కు చెందిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై హైదరూడ నుంచి ఆరాంఘర్ వైపు వెళ్తున్నారు. పిల్లర్ నెంబర్ 233 ఫిష్ బిల్డింగ్ సమీపంలోకి రాగానే ఢీ వైడర్ ను ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో వెనుకాల కూర్చుని ఉన్న గుడిమల్కాపూర్ నివాసి జమీల్ కుమారుడు మహ్మద్ ఇబ్రహీం (14) అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. వాహనం నడుపుతున్న వ్యక్తికి గాయాలైనారు 5. వివరాలు తెలియాల్సి ఉందని అత్తాపూర్ ఇన్స్ పెక్టర్ ఎ సీతయ్య తెలిపారు.

## కరెంటు షాక్‌తో రెండు గేదేలు మృతి

**బుద్వేల్, సెప్టెంబరు 13 (ప్రభాత ఉదయం)**



విధ్యుత్ తీగెలు షాక్ తగిలి రెండు గేదెలు మృతి చెందాయి, ఈ సం ఘటన దర్గా ఖలీజ్ ఖాన్ ప్రాంతంలో ఆదివారం జరిగింది. రాకేశ్ యాదవ్ కు చెందిన రెండు గేదెలు ఆదివారం మేత మేయడానికి వెళ్లగా తెగిపడిన విద్యుత్ తీగెలు షాక్ తగిలాయి. ఈ ప్రమాదంలో గేదెలు అక్కడిక్కడే మృతి చెందాయి. విద్యుత్ సిబ్బంది కరెంటు సరఫరా ను నిలిపివేసారు. అప్పటికే ఆ రెండు గేదెలు మృతి చెందినట్లు తెలిసింది.

## రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు

**బుద్వేల్, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం)**

బీజేపీ నాయకురాలు గౌరీదేవి, రాజేంద్రనగర్ వర్తక సంఘం నాయకులు చేలారాం చౌదరి లు రాజేంద్రనగర్ నియోజకవర్గం ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలియ చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం లో వినాయక చవితి ఉత్సవాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు.



చేలారాం చౌదరి, గౌరి దేవి లు



శ్రీ కనకధార హోమ్ ఫుడ్స్ ను ప్రారంభిస్తున్న రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్. చిత్రంలో దుకాణం యజమాని రాంగోపాల్, కాంగ్రెస్ రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు పడమటి శ్రీధర్ రెడ్డి లు

## బుద్వేల్ నుంచి కిస్మత్ పూర్ వెళ్ళే దారిలో ఏర్పాటు చేసిన శ్రీ కనకధార హోమ్ ఫుడ్స్ ను ప్రారంభించిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

**బుద్వేల్, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం) :**

బుద్వేల్ నుంచి కిస్మత్ పూర్ వెళ్లే దారిలో నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీ కనకదుర్గా హోమ్ ఫుడ్స్ స్వీట్ షాప్ ను ఆదివారం ఉదయం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ ప్రారంభించారు. శ్రీ కనకదుర్గ హోమ్ ఫుడ్స్ ను న్యూ గ్రీన్ సిటీకి చెందిన రామ్ గోపాల్, కీర్తి, ఆర్య , సుబ్రహ్మణ్యేశ్వర రావు, అహల్య ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త వేణు కాకుమాను లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుకాణ యజమాని రామ్ గోపాల్ మాట్లాడుతూ, హోమ్ ఫుడ్ ఎక్స్ పీరియన్స్ ను వినియోగదారులకు అందించడానికి శ్రీ కనకధార హోమ్ ఫుడ్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ, ప్రజలకు మేలైన ఆహార పదార్థాలు అందజేయడానికి కృషి చేయాలన్నారు. శ్రీ కనకదుర్గ ఓం ఫుడ్స్ లో లభించే మిఠాయిలు, తినుబండారాలు ఇంట్లో తయారు చేసిన మాదిరిగా ఉన్నాయన్నారు. కిష్టమ్మ గుట్ట ప్రాంతం బాగా అభివృద్ధి చెందుతుందని, బుద్వేల్, కిస్మత్ పూర్ తదితర ప్రాంతాలకు ఈ దుకాణం సెంటర్ పాయింట్ గా అవుతుందన్నారు. వినియోగదారులు ఇష్టపడే వివిధ రకాల తినుబండరాలను అందుబాటులో ఉంచాలన్నారు. దుకాణ యజమాని రామ్ గోపాల్ మాట్లాడుతు , సరసమైన ధరలకు, నాణ్యమైన మిఠాయిలు, ఇతర తెనుబండరాలను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. కార్యక్రమంలో సినీ నటులు రచ్చ రవి, రాజేందర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు పడమటి శ్రీధర్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోరని బాలరాజ్, రగడంపల్లి శ్రావణ్, ఎం ప్రభాకర్ రెడ్డి, రాపోలు సత్తయ్య, స్థానిక నాయకులు పెండ్యాల సాయి మల్లిక్, అప్పారెడ్డి గూడెం మహేందర్, బి రాజ్ గోపాల్, మహేశ్వరి, సీనియర్ పాత్రికేయులు అప్పారెడ్డిగూడెం భీమయ్య, మాధవి, అక్షయ, స్నిగ్ధ, కోరని కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

# తొలిపూజలు అందుకునేందుకు సిద్ధమైన బొజ్జగణపయ్య

## ఊరూవాడా కోలాహలంగా ఏకదంతుని మండపాలు

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం)**

ముక్కోటి దేవతల తొలి పూజలందుకునే లంభోదరుడు భక్తులను ఆశీర్వదించేందుకు విచ్చేశాడు. జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి 9రోజుల పాటు గణేష్ నవరాత్రోత్స వాలు ఘనంగా ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు వినాయక చవితి సందర్బంగా జిల్లా వ్యాప్తంగా సందడి నెలకొంది. తొలిపూజలు అందుకునేందుకు విఘ్నేశ్వరుడు ముస్తాబ య్యాడు. వాడవాడల్లో విభిన్న హంగులతో నిర్వాహకులు వినాయక మండపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఏకదంతుని మండపాలతో ఊరూవాడా కోలాహలంగా మారింది. వివిధ రూపాల్లో రూపుదిద్దుకున్న బొజ్జ గణపయ్య ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి. వాడవాడల్లో విభిన్న హంగులతో నిర్వాహకులు వినాయక మండపాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వాటికి ఏ మాత్రం తీసిపోకుండా వివిధ రూపాల్లో గణనాథుల్ని కొలువుదీర్చారు. ఈ నేపథ్యంలో వీధి వీధినా గణపతి మండపాలు విద్యుత్ కాంతులతో విరాజిల్లు తుంటాయి. ఈ పర్వదినం ఆధ్యాత్మికమైనదే అయినా ఇప్పుడు సాంకేతిక పరిజ్ఞాన శోభనూ సంతరించుకుంటోంది. మన పండుగల్లో టెక్నాలజీ విడదీయలేని భాగంగా మారుతున్న క్రమంలో గణపతి నవరాత్రులను మరింత ఆనందంగా నిర్వహించుకోవటానికి ఇది తోడ్పడుతోంది.






**వినాయకచవితి సందడి షురూ.. జనాలతో కిటకిటలాడుతున్న గద్వాల మార్కెట్**

గద్వాల పట్టణంలో గణేశ్ విగ్రహాల విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. వినాయక చవితి పర్వదినం సమీపిస్తుండటంతో నగరంలో ఆదివారం ఎక్కడ చూసినా వినాయక విగ్రహాల తరలింపులతో సందడిగా మారింది. గద్వాల పట్టణంతో పాటు గ్రామాల్లోని మండపాల నిర్వహకులు గణపతి విగ్రహాల కొనుగోళ్లలో బిజీగా మారారు. ఈనేపథ్యంలో గద్వాల పట్టణంలో పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, కర్నూల్ రోడ్డు ప్రాంతాలలో వినాయక విగ్రహాల విక్రయకేంద్రాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. రాజస్థానీలు తయారు చేసిన గణేశ్ ప్రతిమలు, అలాగే మట్టితో తయారుచేసి మట్టి వినాయకులను కొనుగోలు చేయడంలో మండలపాల నిర్వహకులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం విక్రయకేంద్రాల్లో రూ.2వేల నుంచి రూ.30వేల వరకు విలువ చేసే వినాయకుల ప్రతిమలు అందుబాటులో ఉన్నాయి. మండపాల యజమానులు వారివారి స్థాయిని బట్టి వినాయకుల ప్రతిమలను కొనుగోలు చేసుకొని వారి ప్రాంతాలకు తరలిస్తున్నారు.

**మార్కెట్ లో సందడి, ఊపందుకున్న పూజా సామాగ్రి**

వినాయక చవితి వేడుకలకు జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంతో పాటు మండల కేంద్రం, పల్లెలు సర్వం సిద్ధమైంది. ఆదివారం ఉదయం నుంచే గద్వాల పట్టణం, అయిజ, అలంపూర్ పట్టణాలకు పరిసర గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో చేరుకుని పండుగకు కావాల్సిన సామగ్రిని కొను గోలు చేశారు. గద్వాల పట్టణంలోని ముఖ్యమైన సర్కిల్ వైఎస్ఆర్ సర్కిల్, రాజీవ్ సర్కిల్, పాత బస్టాండ్, గాంధీ చౌక్ తదితర మార్కెట్ వీధుల్లు జనంతో రద్దీగా కనిపించింది. రాజవీధి, పాతబస్టాండ్ రోడ్డులో వస్త్రదుకా ణాల్లో పండుగ సందడి కనిపించింది. పండుగ వేడుకలతో పూలు, పండ్ల ధరలు ఆకా శాన్నంటాయి. ఇందులో చామంతి పూలు కేజీ రూ.500, బంతిపూ లు కేజీ 200, చిట్టి రోజాలు కేజీ రూ.400, కనకాంబ రాలు కేజీ రూ.500 ధరలు పలికాయి, పండ్లు పండగ పురస్కరించుకొని డబుల్ రేట్లు వ్యాపారులు అమ్మేశారు. కొన్ని చోట్ల అరటిమానులతోపాటు, గెరిక, పచ్చిసీతాఫ లాలు, వెలక్కాయలు, మామిడి ఆకులు, జామకాయలు చిరువ్యాపారులు అధిక సంఖ్యలో అమ్మకాలు నిర్వహించారు. పట్టణంలో పలు చోట్ల బండ్లపై వినాయక మట్టి ప్రతిమలను అమ్మకాలు చేశారు.

**ఉత్సవ మండపాల ఏర్పాట్లు పూర్తి...**

జిల్లాలో గణేశ్ ఉత్సవ మండపాల ఏర్పాట్లు ఇప్పటికే పూర్తి చేశారు. వెదురు తడికెలతో మంటపాలు నిర్మించి, వాటిపై వర్షపు నీరు పడ కుండా ప్లాస్టిక్, టార్పెట్లను కప్పారు. మండపాల లోపల ప్రత్యేక ఆకర్షణగా పలుచటి శిల్కు వస్త్రాలతో తెరలు కట్టి. వాటికి అదనపు ఆకర్షణగా రంగుల కాగితాలు, బెలూన్లు, ప్లాస్టిక్ డెకొరేటెడ్ సామగ్రిని ఏర్పాటు చేశారు. మిరిమిట్లు గొలిపేలా విద్యుత్తు దీపాలు అమర్చారు. మండపాల వైపు వచ్చే దారులకు ఇరువైపులా సిరీస్ బల్బులతో ఓం, స్వస్తిక్, గణపతయే నమః అనే అక్షరాల తో విద్యుత్తు దీపాలను వెలిగించారు.




**పెరిగిన దుకాణాలు**

గద్వాల పట్టణంలో గతంలో కొన్ని చోట్ల మాత్రమే విక్రయాలు జరిగేవి. ఈ సారి చాల చోట్ల విగ్రహాలు అమ్మే దుకాణాలు వెలిశాయి. సోమవారం చవితి సందర్భంగా గద్వాల పట్టణంలో బండ్ల మీద వందల కొద్దీ మట్టి విగ్రహాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన చిన్న విగ్రహాలు అమ్మకానికి పెడతారు. అయితే ప్రస్తుతం ఏర్పాటు చేసిన ఒక్కో షాపులో రూ.100 నుంచి రూ.30వేల వరకు ధర పలికే విగ్రహాలు అమ్మకాలకు సిద్ధంగా ఉన్నాయి. చవితికి సమయం సమీపిస్తుండడంతో భక్తులు విగ్రహాలను కొనుగోలు చేసేందుకు వస్తున్నారు. రంగురంగులు.. విభిన్న ఆకృతులతో మార్కెట్లో ఉన్న విగ్రహాలను ఎంపిక చేసుకుంటున్నారు.

**అనుమతి పత్రాలు ఉండాలి**

మండపాలకు సంబంధించి ఆన్‌లైన్‌లో అనుమతులు రాగానే నిర్వాహకులు డౌన్‌లోడ్ చేసుకొని మండపాల వద్ద అందుబాటులో ఉంచాలి. క్యూఆర్ కోడ్‌తో కూడిన డిజిటల్ అనుమతి పత్రం మంజూరు చేస్తారు. పోలీస్, అగ్నిమాపక, మున్సిపల్, పంచాయతీ, విద్యుత్తు, రెవెన్యూ శాఖల అధికారులు తనిఖీలకు వచ్చినప్పుడు ఆన్‌లైన్ అనుమతితో కూడిన ఎన్‌ఓసీ పత్రం చూపాలి.

**ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు: టి.శ్రీనివాస రావు జిల్లా ఎస్పీ**

జిల్లా వ్యాప్తంగా ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు జరిగేలా నిర్వాహకులు దృష్టిసారించాలి మండపాలకు సంబంధించి అనుమతులు తప్పనిసరిగా పొందాలి. శాంతిభద్రతలకు విఘాతం కలిగించకుండా భక్తిశ్రద్ధలతో వినాయక ఉత్సవాలు నిర్వహించేలా కమిటీ సభ్యుల సహకరించాలి.




## ఉచిత వైద్య శిబిరానికి విశేషమైన స్పందన

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 13 (ప్రభాత ఉదయం)**

వెంకటాద్రి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారము నిర్వహించిన వైద్య శిబిరానికి ప్రజల నుండి విశేషమైన స్పందన లభించింది. ఈ వైద్య శిబిరం ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు, ఆరోగ్య పరీక్షలు అవసరమైన వైద్య సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని తమ వైద్య సేవలను అందించి, వైద్య శిబిరాన్ని విజయవంతం చేయడంలో విశేషంగా సహకరించిన వైద్యులుడాక్టర్ కార్తిక్ -- ఎండి, అనస్థీషియా,డాక్టర్ అర్చన -- డెంటల్ సర్జన్,డాక్టర్ గౌతమి ప్రియ -- జనరల్ ఫిజిషియన్,డాక్టర్ సౌమ్యా -- స్త్రీల వ్యాధి నిపుణురాలువైద్యులను 24వ డివిజన్ కార్పొరేటర్ ఒంటెల సత్యనారాయణ రెడ్డి ఘనంగా సన్మానించారు. ప్రజల ఆరోగ్యానికి ఉపయోగపడే ఇటువంటి సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన వెంకటాద్రి హాస్పిటల్ యాజమాన్యానికి వైద్య బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# మట్టి వినాయకుల పంపిణీతో పర్యావరణ పరిరక్షణ

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 13 (ప్రభాత ఉదయం)**

అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్, డిస్ట్రిక్ట్ 137గా ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం నిర్వహించే పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఈ సంవత్సరం కూడా సుమారు 70 మందికి మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ అలగండుల మాట్లాడుతూ, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారు చేసిన విగ్రహాల వల్ల నీరు, నేల మరియు పర్యావరణానికి కాలుష్యం ఏర్పడుతుందని వివరించారు. పర్యావరణహితమైన మట్టి వినాయకులను ఉపయోగించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చని, పూజ అనంతరం మట్టి తిరిగి మట్టిలో కలిసిపోయే విధంగా ఉండటం మట్టి వినాయకుల ప్రత్యేకత అని తెలిపారు. డిస్ట్రిక్ట్ 137గా పర్యావరణ పరిరక్షణలో భాగంగా గతంలో గ్రీన్ పోస్టర్ డ్రాయింగ్ పోటీలు, 1,200 మొక్కల నాటడం వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించిందని తెలిపారు. మట్టి వినాయకుల పంపిణీ కూడా పర్యావరణహిత పండుగల నిర్వహణకు ప్రజల్లో అవగాహన కల్పించే మరో ముఖ్యమైన కార్యక్రమమని పేర్కొన్నారు. అలాగే, స్వాతంత్ర్యోద్యమ కాలంలో ప్రజలను ఒకే వేదికపైకి తీసుకురావాలనే ఉద్దేశంతో లోకమాన్య బాల గంగాధర్ తిలక్ 1893లో మహారాష్ట్రలో సార్వజనిక గణపతి ఉత్సవాలను ప్రాచుర్యంలోకి తీసుకువచ్చారని వివరించారు. అనంతరం ఈ సంప్రదాయం దేశవ్యాప్తంగా, ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందని తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, డాక్టర్ జి.ఎం. కిరణ్, డాక్టర్ పురుషోత్తం, డాక్టర్ అశోక్, డాక్టర్ శ్రీనివాస్ అలగండుల, డాక్టర్ సౌమ్య, డాక్టర్ సాయి మేఘన, డాక్టర్ సాయి ప్రీతం తదితరులకు మట్టి వినాయక విగ్రహాలను అందజేసి, పర్యావరణ పరిరక్షణలో వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ. శ్రీనివాస్, ఇంజనీర్ కోలా అన్నా రెడ్డి, జిల్లా గవర్నర్ కొంజర్ల మహేశ్, టి.వి. రావు, బండిపల్లి వెంకటరమణ, హుజూరాబాద్ క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ శ్రీ మనోజ్, ప్రసాద్, సాగర్ రెడ్డి, పులాల శామ్, నాగేశ్వర్, కుమారస్వామి, వెంకన్న మరియు వాసుదేవ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు





## పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీ

### ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం)**

పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాలనీ ప్రజలకు మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరికెపూడి గాంధీ ఆదేశాల మేరకు గత పది సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిరంతరంగా నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు జనంపల్లి పురంధర్ రెడ్డి మాట్లాడుతూ.. వినాయక చవితి సందర్భంగా కాలనీ ప్రజలు పర్యావరణహితమైన మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలనే ఉద్దేశంతో ప్రతి సంవత్సరం విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. గత పదేళ్లుగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తూ ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారైన విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉందని, మట్టి విగ్రహాల వినియోగం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం పర్యావరణహితమైన మట్టి విగ్రహాలను వినియోగించి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఆర్. రామచంద్రరావు, లక్ష్మీనారాయణ, సూర్యనారాయణ, నర్సింగ్‌రావు, వెంకటేశ్వరరావు, సుధాకర్, సుబ్బారెడ్డి, నందు, అశ్విత్, రోహిత్, కళ్యాణ్ తదితరులు పాల్గొని కాలనీ ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా పూర్తి చేయాలి

## అధికారులకు కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశం

**ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్, 13 (ప్రభాత ఉదయం)**

ఎస్ ఐ ఆర్ ప్రక్రియను అధికారులు సిబ్బంది పకడ్బందీగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో ఒక్క అనర్హుడికి చోటు లేకుండా.. ఒక్క అర్హుడి పేరు గల్లంతు కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా స్పష్టం చేశారు. ఓటర్ల జాబితాను దోషరహితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్ -2026) ప్రక్రియను ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం పకడ్బందీగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఓటర్ల వివరాల పరిశీలనలో ఏమాత్రం పొరపాట్లకు తావివ్వకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్ల జాబితాలో గుర్తించిన వ్యత్యాసాలు, అన్‌మ్యాప్డ్ ఓట్లు, ఇతర మార్పులకు సంబంధించి సంబంధిత ఓటర్లకు అవసరమైన నోటీసులను వెంటనే అందజేయాలని బి ఎల్ ఓ లను ఆదేశించారు. నోటీసుల అనంతరం చేపట్టే క్షేత్రస్థాయి విచారణలను పారదర్శకంగా నిర్వహించి, సంబంధిత నివేదికలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. జిల్లాలో రెండు లక్షల 70 వేల మందికి దరఖాస్తులు అందించాల్సి ఉండగారు 2,24,263 మంది ఓటర్లకు నోటీసులు అందించామని తెలిపారు.. దాదాపు లక్ష మంది వరకు నోటీసులకు సమాధానాలు ఇచ్చినట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు తమ ఓటు హక్కును నిర్ధారించుకునేందుకు ఎన్నికల సంఘం గమనిక లో సూచించిన గుర్తింపు కార్డులను అధికారులకు సమర్పించాలన్నారు.



**దరఖాస్తులు పెండింగ్‌లో ఉండొద్దు.**

కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన ఫారం-6, ఓటర్ల జాబితాలో పేరు తొలగింపు లేదా ఆక్షేపణలకు ఫారం-7, పేరు, చిరునామా తదితర వివరాల మార్పులు, సవరణలకు ఫారం-8 ద్వారా వచ్చిన దరఖాస్తులను ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించాలని తహశీల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. నిబంధనల ప్రకారం వాటిని పరిష్కరించి, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చూడాలని స్పష్టం చేశారు. ప్రత్యేక ప్రచార దినాల్లో స్వీకరించిన దరఖాస్తులను కూడా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల నుంచి అందిన దరఖాస్తులు, అభ్యర్థనలు, సవరణలకు సంబంధించిన వివరాలను సంబంధిత అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాలని తెలిపారు.

**బి ఎల్ ఓ ల పనిపై క్రాస్ వెరిఫికేషన్.**

బి ఎల్ ఓ సూపర్‌వైజర్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ బి ఎల్ ఓ లు నిర్వహించిన పనులను క్రాస్ వెరిఫికేషన్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఓటర్ల వివరాల పరిశీలన, అన్‌మ్యాప్డ్ ఓట్ల గుర్తింపు, నోటీసుల జారీ, దరఖాస్తుల పరిష్కారం వంటి ప్రతి దశలోనూ పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఎన్నికల విధుల్లో అలసత్వం లేదా నిర్లక్ష్యం వహించే వారిపై నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరించారు.

**ప్రతి ఓటరూ జాబితాను పరిశీలించుకోవాలి.**

ఓటర్ల జాబితా సవరణలో అధికారుల పాత్రతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. 18 ఏళ్లు నిండిన అర్హులైన యువతతో పాటు ప్రతి ఓటరూ తమ పేరు ఓటర్ల జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని కోరారు. పేరు, చిరునామా, ఇతర వివరాల్లో ఏవైనా తప్పులు లేదా మార్పులు ఉంటే వెంటనే ఎన్నికల సిబ్బంది దృష్టికి తీసుకురావాలని సూచించారు. కొత్తగా ఓటరు నమోదుకు ఫారం-6, పేరు తొలగింపు లేదా ఆక్షేపణలకు ఫారం-7, వివరాల మార్పులు, సవరణలకు ఫారం-8 ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తులను సమర్పించుకోవచ్చని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండటం.. అనర్హుల పేర్లు తొలగించడం.. నమోదైన వివరాల్లో తప్పులు లేకుండా చూడటమే ఎస్ ఐ ఆర్ ప్రక్రియ లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. అధికారులు, ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తేనే దోషరహిత, పారదర్శక ఓటర్ల జాబితా సాధ్యమవుతుందని, అందుకు ఓటర్లు కూడా తమ వివరాలను పరిశీలించుకుని సహకరించాలని కోరారు. ఎస్ ఐ ఆర్ ప్రక్రియ పూర్తయ్యే వరకు ఇదే స్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని కలెక్టర్ అట్టి ప్రకటన లో వెల్లడించారు.



## పర్యావరణహిత మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించాలి

### కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జ్, ఖమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్

**కూకట్ పల్లి, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం)**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణ కోసం జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ శెట్కార్ సూచనల మేరకు బాలానగర్ కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, మల్లికార్జున్ ఆధ్వర్యంలో ఆదివారం రాజు కలని గాంధీ బొమ్మ వద్ద ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధితిగా కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జ్, ఖమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్, కూకట్ పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పుష్ప రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ లక్ష్మణ్, బాలానగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు పులి శివ కుమార్ గౌడ్ హాజరై విగ్రహాల పంపిణి చేశారు. ఈ సందర్బంగా బండి రమేష్ మాట్లాడుతూ నగరంలో పర్యావరణహిత మట్టి విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించడాని కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో మాదిరిగానే స్థానిక మున్సిపల్, పర్యావరణ శాఖ లేదా స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఉచిత మట్టి విగ్రహాలను పెద్ద ఎత్తున పంపిణీ ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా డీసీసీ ఉపాధ్యక్షులు పులి శ్రీకాంత్ పటేల్, అధికార ప్రతినిధి మధు మోహన్, సీనియర్ నాయకులు సత్యాపల్ రెడ్డి, మహంకాళి శ్రీనివాస్, శ్రీకాంత్ గౌడ్, సదా గౌడ్, దండు రవి గౌడ్, జల్లా శివ, జావీద్, భారత్, మహిళా నాయకురాలు సాయి భారతి, పద్మావతి, ఊర్మిళ, శ్రేమలత తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి దశ నుండే క్రీడలపై ఆసక్తి పెంపొందించాలి

**సమాజం నుండి మాదకద్రవ్యాలను తరిమికొట్టాలి**

**ప్రతి విద్యార్థి క్రీడా స్ఫూర్తి పెంపొందించుకోవాలి**

**క్రీడలు.. క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం:పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చేరు లో ఘనంగా ప్రారంభమైన కీర్తిశేషులు గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక ప్రథమ జాతీయస్థాయి ఓపెన్ కరాటే, కుంగ్ ఫూ ఛాంపియన్షిప్ పోటీలు**

**వివిధ రాష్ట్రాల నుండి హాజరైన క్రీడాకారులు**

**ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు**






**పటాన్ చెరు, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం)**

ప్రస్తుత పోటీ ప్రపంచంలో మానసిక ప్రశాంతత, శారీరక ధారుడ్యత కోసం విద్యార్థి దశ నుండి క్రీడలపై ఆసక్తి పెంపొందించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని.. నియోజకవర్గంలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని పటాన్ చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ఆదివారం పటాన్ చెరు డివిజన్ పరిధిలోని సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ మల్టీపర్పస్ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే సౌజన్యంతో ఛాంపియన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గూడెం విష్ణువర్ధన్ రెడ్డి స్మారక ప్రథమ జాతీయ స్థాయి కరాటే, కుంగ్ ఫూ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎమ్మెల్యే జిఎంఆర్ ముఖ్యఅతిథిగా హాజరై లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ పటాన్చెరు కేంద్రంగా జాతీయ స్థాయిలో కరాటే, కుంగ్ ఫూ పోటీలు నిర్వహించడం సంతోషకరంగా ఉందన్నారు. వివిధ రాష్ట్రాల నుండి సుమారు 2000 మంది క్రీడాకారులు టోర్నమెంట్ కు హాజరు కావడం పటాన్చెరు నియోజకవర్గం యొక్క ఖ్యాతిని నలుదిశలా చాటి చెప్పినట్లు అయ్యిందని అన్నారు. చిన్ననాటి నుండి తనకు క్రీడలు అంటే ఎంతో మక్కువ అని, నియోజకవర్గ స్థాయిలో క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. దశాబ్దాల చరిత్ర కలిగిన పటాన్చెరు పట్టణంలోని మైత్రి మైదానాన్ని ఆధునికరించడంతోపాటు.. ఏడాది పొడవునా వివిధ క్రీడ అంశాల్లో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ స్థాయి క్రీడాకారుల కోసం నియోజకవర్గ వ్యాప్తంగా మూడు మినీ స్టేడియాలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.ప్రస్తుత సమాజంలో మాదకద్రవ్యాలు అత్యంత ప్రమాదకరంగా మారాయని. సమాజం నుండి వాటిని తరిమి కొట్టడంలో ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థి దశ నుండి పిల్లలకు వాటి దుష్పరిమానాలను వివరించాలని కోరారు. విద్యార్థులు చదువుతోపాటు, క్రీడల పైన ఆసక్తి పెంచుకొని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని కోరారు. క్రీడాకారులకు ఎటువంటి సహకారం కావాలన్న తనను సంప్రదించాలని కోరారు. జాతీయస్థాయి పోటీలు నిర్వహణకు సంపూర్ణ సహకారం అందించిన ఎమ్మెల్యే జిఎంఆర్ కు నిర్వాహకులు, క్రీడాకారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, సీనియర్ నాయకులు నర్రా బిక్షపతి, వెంకటేష్, రామ్మోహన్, షకీల్, చంద్రకుమార్, కరాటే మాస్టర్లు లక్ష్మణ్, రాజు, వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారులు, తల్లిదండ్రులు, అకాడమీ మాస్టర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వేళాపాలలేని కరెంటు కోతలపై రైతుల నిరసన

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 13(ప్రభాత ఉదయం)**

వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో తీవ్ర కోతలు విధిస్తున్నారంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కరెంటు కోతలను నిరసిస్తూ ఆదివారం కేటిదొడ్డి మండలం ఇర్కిచేడులోని విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద రైతులు నిరసన చేపట్టారు. 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం, ప్రస్తుతం కనీసం 6 గంటలు కూడా అరకొరగా ఇస్తోందని రైతులు మండిపడ్డారు. వేళాపాళా లేని లో-వోల్టేజీ కరెంటు వల్ల పొలాలకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయని, మరోవైపు మోటార్లు కాలిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు కోతలపై సబ్ స్టేషన్ లైన్మెన్ ను అడగగా నాకేం తెలియదు, మండల విద్యుత్ అధికారులను అడగాలని సూచించారని, బాధ్యత గల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు మండిపడారు.



## బిఆర్ఎస్ పార్టీలో బొల్లారం యువకుల చేరికలు

**పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి,మాజీ ఎంపీపీ రవీందర్ రెడ్డి**

**పటాన్ చెరు, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం)**

బొల్లారం డివిజన్ పరిధిలోని బీరప్ప బస్తికి చెందిన సుమారు 35 మంది కాంగ్రెస్ పార్టీకి చెందిన యువకులు బిఆర్ఎస్ పార్టీలో చేరారు. స్థానిక సీనియర్ కార్యకర్త శ్రీనివాస్ రాజు నేతృత్వంలో యువకులను జిన్నారం మాజీ జెడ్పీటీసీ కొలన్ బాల్ రెడ్డి, జిన్నారం మాజీఎంపీపీ కొలన్ రవీందర్ రెడ్డిలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా యువకులు అభి,పవన్,నాగ, నిఖిల్,మన్మయి,లోకేష్,నిసర్,సంపత్,సాయి మరి కొంతమంది బీఆర్ఎస్ పార్టీ లో చేరారు. ఈ కార్యక్రమంలోబొల్లారం మాజీ కౌన్సిలర్లు బి.జైపాల్ రెడ్డి ,టి.సాయికిరణ్ రెడ్డి,శైలజ పుండరికం ,మన్నె సతీష్ ముదిరాజ్,వట్టిపల్లి శ్రీకాంత్ యాదవ్,మాజీ ఎంపీటీసీ అరూర్ రత్నం , మాజీ వార్డు మెంబర్ శారద,మైలారం యాదగిరి,ఇమ్రాన్ బస్తీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.



## మృతి చెందిన పేద కూలీ కుటుంబానికి ఆనంద్ కృష్ణారెడ్డి ఆర్థిక సాయం

**పటాన్ చెరు, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం)**

జీహెచ్ఎంసీ 272 డివిజన్ బొల్లారం పరిధిలోని లక్ష్మీ నగర్ కాలనీలో గత 20 ఏళ్లుగా నివసిస్తున్న బీహార్ వలస కూలీ దశరథ్ రామ్ అనారోగ్యంతో కన్నుమూశారు. రోజువారీ కూలీపై ఆధారపడి జీవించే ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విషయాన్ని స్థానికులు బీజేపీ నాయకుడు కెజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. సమాచారం తెలుసుకున్న వెంటనే ఆయన బాధిత కుటుంబాన్ని పరామర్శించి, మృతదేహానికి నివాళులర్పించారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం తన వంతుగా రూ. 10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కష్టసమయంలో తక్షణమే స్పందించి అండగా నిలిచిన ఆనంద్ కృష్ణారెడ్డి ఉదారతకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.



## మట్టి వినాయకుని పూజించి పర్యావరణాన్ని కాపాడాలి

**బొల్లారం బీజేపీ అధ్యక్షులు కెజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి**

**బొల్లారంలో పాత్రికేయుల చేతుల మీదుగా మట్టి వినాయక ప్రతిమల పంపిణి**

**పటాన్ చెరు, సెప్టెంబర్ 13( ప్రభాత ఉదయం)**

మట్టి వినాయకుని పూజించడం ద్వారా పర్యావరణాన్ని రక్షించగలుగుతామని బొల్లారం బీజేపీ అధ్యక్షులు కెజెఆర్ ఆనంద్ కృష్ణ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బొల్లారం డివిజన్ పరిధిలోని బీజేపీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షులు కెజెఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చెసిన మట్టి వినాయక ప్రతిమలను పాత్రికేయుల చేతుల మీదుగా పంపిణి చేయించారు. ఈ సందర్భంగా విలేకరులు జి. రామకృష్ణ,కృష్ణ కిషోర్, నరసింహ రెడ్డి మట్టి వినాయకుల ప్రతిమలను స్థానిక ప్రజలకు పంపిణి చేసారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆనంద్ కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు.భక్తి శ్రద్ధలతో వినాయకుడిని పూజించి వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆనంద్ కృష్ణారెడ్డి బొల్లారం ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు టీ. రవీందర్ రెడ్డి, సమ్మయ్య,మోహన్,మోహిత్, బొల్లారం మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.



## పెద్ద చింతరేవులలో వైభవంగా ఉడిపి పాలిమర్ పీఠాధిపతుల 48వ చాతుర్మాస్య మహోత్సవం

**నేడు వినాయక చవితి వేడుకలు...**

**ఈనెల 25 వరకు చాతుర్మాస్య మహోత్సవం దీక్ష పూజలు...**

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 13(ప్రభాత ఉదయం)**

ధరూర్ మండల పరిధిలోని పెద్ద చింతరేవులలో అన్నప్రసాద సత్రంలో ఉడిపి,పాలిమర్ పీఠాధిపతుల 48వ చాతుర్మాస్య మహోత్సవం దీక్షలు, ప్రత్యేక పూజలు వైభవంగా జరుగుతున్నాయని పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు తెలిపారు. ఆదివారం నాడు 44వ రోజు చాతుర్మాస ప్రత్యేక పూజలు పాలిమర్ పీఠాధిపతులు శ్రీ 1008 విద్యాదిశ తీర్థ శ్రీ పాదులు స్వామి వారు, శ్రీ 1008 విద్యా రాజేశ్వర తీర్థ శ్రీపాదుల వారు సంయుక్తంగా మూలరాములకు,శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు ఉడిపి వేద అర్చక బృందం వారి వేద మంత్రోచరణల మధ్య నిర్వహించారు.శ్రీ ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేకంగా అభిషేక పూజలు చేశారు. భాగవత రామాయణ ప్రవచనాలు స్వామీజీలు భక్తులకు నిర్వహించారు.వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులచే పవమాన హోమం,నవగ్రహ హోమం,గోపూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు పీఠాధిపతులు మంత్రక్షలు, ఆశీర్వచనాలు అందజేశారు. పెద్ద చింతరేవుల ఆంజనేయ అన్న ప్రసాద ట్రస్ట్ వారిచే భక్తులకు అన్నప్రసాద పంపిణీ చేశారు. సోమవారం నాడు వినాయక చవితి సందర్భంగా పీఠాధిపతులు ప్రత్యేకంగా వినాయక చవితి పూజలు నిర్వహిస్తారని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆద్య వామనాచారి, ఆద్య కిష్టాచారి, ఆద్య మద్వాచారి, భక్తులు పాల్గొన్నారు.






## దోపిడీ, పీడన, హత్యలు అత్యాచారాలకు వ్యతిరేక ప్రతిఘటనే సాయుధ పోరాటం: జాన్ వెస్లీ

**గద్వాల జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 13(ప్రభాత ఉదయం)**

దోపిడీ, పీడన, హత్యలు అత్యాచారాలకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ ప్రతిఘటనే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమని తెలంగాణ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని వాల్మీకి కమ్యూనిటీ హాల్లో జిల్లా కమిటీ సభ్యులు వీవీ నరసింహ అధ్యక్షతన జరిగిన సెప్టెంబర్ 17 వక్రీకరణలు వాస్తవాలు అంశంపై నిర్వహించిన సెమినార్ కు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిజాం పాలనలో జమీందారులు భూస్వాములు చేసిన దోపిడీ పీడన హత్యలు మహిళలపై జరిగిన అత్యాచారాలకు వ్యతిరేకంగా, భూమి భుక్తి కోసం జరిగిన ప్రపంచవ్యాప్త మహోన్నత పోరాటమే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటమని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలలో భూస్వాములు దొరలు రైతాంగం పై చేసిన ఆకృత్యాలకు వ్యతిరేకంగా ఈ పోరాటం జరిగిందన్నారు. మల్లు స్వరాజ్యం,దొడ్డి కొమరయ్య,చాకలి ఐలమ్మ, షేక్ బందగి వంటి ఎందరో నాయకులు భూస్వాములకు వ్యతిరేకంగా రక్త తర్పణ చేసి పది లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేశారని తెలిపారు. 4000 గ్రామాలలో గ్రామ స్వరాజ్యాన్ని ఏర్పాటు చేసి గడీల నుండి దొరలను భూస్వాములను వెళ్లగొట్టి సమ సమాజ నిర్మాణం లో కీలకపాత్ర పోషించాలని తెలిపారు. పెళ్ళి అయిన మొదటి రోజే ఆడపిల్లను దొర ఇంటికి పంపించే దుర్మార్గమైన అకృత్యాలకు వ్యతిరేకంగానే పోరాటం జరిగిందన్నారు.ఈ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అన్ని వర్గాల ప్రజలు నిజాం అనుసరిస్తున్నటువంటి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా జరిగిందని, కానీ మతోన్మాద బిజెపి సాయుధ పోరాటాన్ని హిందూ ముస్లింల కొట్లాటగా చిత్రీకరించి లాభ పడాలని ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. తెలంగాణ ముమ్మాటికి విలీనమే అని, మతోన్మాదుల ఆటలు తెలంగాణ గడ్డపై సాగనివ్వబోమని సాయిద రైతాంగ పోరాట అమరుల స్ఫూర్తితో భూమిలేని పేదలందరికీ భూమి పంచేదాక, ఎర్రజెండా ఉద్యమాలు ఆపమని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆర్ శ్రీరామ్ నాయక్, జిల్లా కార్యదర్శి ఏ వెంకటస్వామి, జిల్లా కమిటీ సభ్యులు రేపల్లె దేవదాసు,జి. రాజు,పరం జ్యోతి, మద్దిలేటి, ఉప్పేర్ నరసింహ, నాయకులు హమాలీ నర్సింహులు, లక్ష్మన్న, విజయ్ కుమార్, వివిధ మండలాల నుండి కార్యకర్తలు పాల్గొన్నారు.



## భక్తిశ్రద్ధలతో వినాయక నవరాత్రి ఉత్సవాలు నిర్వహించుకోవాలి

**నూతన వినాయక షెడ్డులను ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

**పటాన్ చెరు, సెప్టెంబర్ 13 (ప్రభాత ఉదయం)**

పటాన్ చెరు నియోజకవర్గ ప్రజలందరూ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సవాల మధ్య ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం బీరంగూడ డివిజన్ పరిధిలోని సాయికృపా కాలనీ, సాయి భగవాన్ కాలనీలలో నూతనంగా నిర్మించిన వినాయక షెడ్డులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన వినాయక చవితి సందర్భంగా కాలనీల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తూ ప్రజలంతా ఐకమత్యంతో పండుగను జరుపుకోవాలని సూచించారు. కాలనీల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు, అభివృద్ధి కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలందరికి. వినాయక చవితి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ ప్రజా ప్రతినిధులు మల్లేష్, బాలరాజు, కృష్ణ, జగదీష్ తదితరులతో పాటు ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608